వేదాంతభేరి

సెప్టెంబరు 2019

రూ. 10/-

Scanned by CamScanner

18-8-2019వ తేదీ శ్రీకాళహస్తి వరదరాజుల గుడిలో
ప్రారంభమైన శ్రీశుకబ్రహ్మాశ్రమం వారి రామాయణ సదస్సు

శ్రోతలు

ఓం వేదాంతభేరి ఓం

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 52 సెప్టెంబరు 2019 సంచిక : 09

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు
శ్రీవిజయానంద బ్రహ్మచారి
కె.ఈశ్వర్
డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,
డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1500/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు , విడి సంచిక రూ. 10/-లు
విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు : శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

Scanned by CamScanner

ॐ **వేదాంతభేరి** ॐ

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 52 సెప్టెంబరు 2019 సంచిక : 09

విషయసూచిక

1.	ప్రార్థన	5
2.	ఉత్తిష్ఠత! జాగృత!! - శ్రీ విద్యాప్రకానందగిరి స్వాములవారు	6
3.	ఇంద్రియ నిగ్రహము - శ్రీమలయాళ స్వాములవారు	10
4.	వాడే సుఖవంతుడు - శ్రీవిద్యాస్వరూపానందగిరి స్వాములవారు	14
5.	వేదపరిచయము - శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు	19
6.	భాగవతం - 6వ స్కంధం - శ్రీమాతా పరా విద్యానందగిరి వారు	22
7.	జీవితమొక తోలుబొమ్మలాట - శ్రీసత్యసాయిబాబా	26
8.	ఉద్ధవగీత - యేలేశ్వరపు హనుమరామకృష్ణ	31
9.	అమ్మ ఆరాధన - డా॥కె.బి.రాజేంద్రప్రసాద్	37
10.	వార్తలు	42

ముఖచిత్రం :

విఘ్నవినాశకుడు వినాయకుడు

1-9-2019 వరాహజయన్తి

2-9-2019 వినాయకచవితి

3-9-2019 షిపంచమి

10-9-2019 వామన జయన్తి

12-9-2019 అనంతపద్మనాభజయన్తి

28-9-2019 మహాలయ అమావాస్య

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

శ్రీ గణేశ పంచరత్న స్తోత్రమ్

- జగద్గురు ఆదిశంకరాచార్యులు

ముదాకరాత్తమోదకం సదావిముక్తి సాధకం ।
కళాధరావతంసకం విలాసిలోక రక్షకమ్ ।
అనాయకైకనాయకం వినాశితేభదైత్యకం ।
నతాశుభాశునాశకమ్ నమామి తం వినాయకం ॥

నతేతరాతి భీకరం నవోదితార్కభాస్వరం ।
నమత్సురారి నిర్జరం నతాధికాపదుద్ధరమ్ ।
సురేశ్వరం నిధీశ్వరం గజేశ్వరం గణేశ్వరం ।
మహేశ్వరం తమాశ్రయే పరాత్పరం నిరన్తరమ్ ॥

సమస్తలోకశంకరం నిరస్త దైత్యకుంజరం ।
దరేతరోదరం వరం వరేభవక్త్ర మక్షరమ్ ।
కృపాకరం క్షమాకరం ముదాకరం యశస్కరం ।
మనస్కరం నమస్కృతాం నమస్కరోమి భాస్వరమ్ ॥

అకించనార్తి మార్జనం చిరంతనోక్తి భాజనం ।
పురారి పూర్వనందనం సురారిగర్వచర్వణమ్ ।
ప్రపంచనాశభీషణం ధనంజయాది భూషణం ।
కపోలదానవారణం భజే పురాణ వారణమ్ ॥

నితాన్త కాన్తి దన్త కాన్తి మన్త కాన్తి కాత్మజం ।
అచిన్త్య రూపమంత హీన మంతరాయకృన్తనమ్ ।
హృదన్తరే నిరన్తరం వసన్తమేవ యోగినాం ।
తమేకదన్త మేవ తం విచిన్తయామి సంతతమ్ ॥

మహాగణేశ పంచరత్న మాదరేణ యోన్వహం ।
ప్రజల్పతి ప్రభాతకే హృదిస్మరన్ గణేశ్వరం ।
అరోగతామదోషతాం సుసాహితీం సుపుత్రతాం ।
సమాహితాయురష్టభూతిమభ్యు పైతి సోచిరాత్ ॥

ఉత్తిష్ఠత! జాగ్రత!!

- శ్రీ విద్యాప్రకానందగిరి స్వాములవారు

'ఉత్తిష్ఠత జాగ్రత!" అని ఉపనిషత్తులు ఘోషించు చున్నవి. Awake, Arise – లెండు మేలుకొనుడు! అని మహనీయులు ఉద్ఘోషించుచున్నారు. జన్మజన్మాంతరము అజ్ఞాన తమస్సునబడి నానాయాతనలు జెందుచు మత్తుగ కాలము గడుపుచున్న జీవరాసులను గూర్చి మహాత్ము లివ్విధముగ హెచ్చరిక చేయుచున్నారు. కావున వారి యా వాక్యములను శ్రద్ధతో నాలకించి (మోహ) నిద్రనుండి లేచి మత్తును పారద్రోలి, సద్గురువుల సన్నిధికేగి ముక్తిమార్గములను వెతకికొనవలెను. శాశ్వత శాంతికై ఉపాయములను అన్వేషించవలెను.

మోక్షాధీశుడగు పరమేశ్వరుని శరణులందుటయే శాంతి సుఖముల బడయుటకు ఏకైక మార్గము. ఈ మార్గము నవలంభించియే యెందరో మహనీయులు పూర్వము తరించి యుండిరి. తరించుచున్నారు, తరింపగలరు. అనంతానంధ మొసంగునట్టి పరమేశ్వరుని జనులేల శరణుబొందరాదు? క్షణిక భోగవిలాసములందు జీవితములను ధారపోయనేల? ఎంతయో పుణ్యమను డబ్బును వెచ్చించి ఈ మానవ శరీరమను నౌకను జీవుడు కొనియున్నాడు. నౌక ఎల్లకాలము చక్కని స్థితిలో నుండునా? ఉండదు. కొంత కాలమునకు చిల్లులుపడును. శైథిల్యము నొందును. అట్లు కాక పూర్వమే సముద్రమును దాటివేయవలెను. నావ చక్కని స్థితిలో నున్నప్పుడే నావికుడు జాగరూకుడై దాటవలసిన జలమును దాటివేయవలసి యున్నది.

మహతా పుణ్యపణ్యేన క్రీతేయం కాయనౌస్త్వయా
పారం దుఃఖోదధేర్గన్తుం తర యావన్నభిద్యతే.

మహత్తర పుణ్యమను ఖరీదు చెల్లించి కొనినటువంటి ఈ మానవ దేహము శిథిలము కాకపూర్వమే సంసారమను దుఃఖసాగరమును జీవుడు తరించవలెను. బాల్యము అతి త్వరితముగ దాటిపోయి యౌవన మేతెంచుచున్నది. 'ఆహా! యౌవన వైభవమెంత ఆహ్లాదముగనున్నది!' అని అనుకొనుచుండగనే శరీరము ముడుతలుపడ నారంభించుచున్నది. జుట్టు తెల్లబడుచున్నది. పండ్లు ఊడుచున్నవి. చూపు తగ్గుచున్నది. వ్యాధులు బాధించుచున్నవి. క్రమముగ వార్ధక్యము జొరబడి తాను ముందుబోవుచు 'ఓయీ! మృత్యువా! ఇక నీవు వెనుక రావచ్చును' అని అంతకుని ఆహ్వానించుచున్నది. ఈ సన్నివేశమునే విష్ణుభగవానుడు పూర్వము గరుత్మంతునకు ఈ ప్రకారముగ చక్కగ వర్ణించి చెప్పెను –

జరా దర్శితపన్థానం ప్రచండవ్యాధిసైనికమ్
మృత్యుశత్రు రధిష్ఠోఽసి త్రాతారం కిం న పశ్యసి.

(గరుడపురాణము)

"వార్ధక్యము దారిచూపుచుండ భయంకర రోగములను సైనికులతో గూడి మృత్యువను శత్రువు నీమీదికి దండెత్తి వచ్చుచున్నాడు. రక్షించువాని కొఱకు ఏల ప్రయత్నించుట లేదు?"

కావున అశాంతికరమగు ఈ సంసార వాతావరణములో పడియున్న జీవుడు భగవచ్ఛరణాగతి ద్వారా, ఆత్మానాత్మవివేచన ద్వారా శాంతికి మార్గము అతిశీఘ్రముగ వెతకవలసి యున్నది. భావికాల శ్రేయస్సును గూర్చి యోచించవలసి యున్నది. వర్తమానకాలమును మాత్రము చూచునది పశువు. భూతభవిష్యత్తును గూడ చూచువాడు మానవుడు.

ఎన్నియో జన్మలు ఇప్పటికి గడచినవి. అజాగ్రత్తగ నున్నచో ఇంకను ఎన్నియో జన్మలు రానున్నవి. ఈ అనంత జీవితము ఒక పెద్ద గొలుసువలె

Scanned by CamScanner

నున్నది. ఒక్కొక్క జన్మ ఒక్కొక్క రింగువంటిది. వెనుకటి జన్మలు దాటిపోయినవి. కావున వానిని మనమేమియు చేయజాలము. రానున్న జన్మలు మాత్రము ఇపుడు మన చేతిలో నున్నవి. వానిని అంతమొనర్చుటకు తగిన శక్తి సామర్థ్యములు మానవునకు కలవు. శమదమాది సాధనసంపత్తిని అలవఱచుకొని, వైరాగ్యము, భక్తి మొదలగు దైవగుణములను పెంపొందించుకొని క్రమముగ జ్ఞానాగ్నిని రగుల్కొలిపినచో 'కర్మ' కట్టెలన్నియు దగ్ధములుకాగా ఇక భవిష్యజ్జన్మలకు పూర్ణ విరామము (Fullstop) ఏర్పడి జన్మరాహిత్యము సిద్ధించగలదు. కావున శరీరము ఆరోగ్యముగ నున్నపుడే, వార్ధక్యము రాకపూర్వమే, ఇంద్రియముల శక్తి క్షీణించక మునుపే, ఆయుష్షు క్షయించకముందే తన శ్రేయస్సును గుఱించి తాను బాగుగ యోచించుకొనవలెను. అట్లుకాక 'ఇప్పుడేమి తొందఱ, ఇంకను పిల్లలకు వివాహమే కాలేదు. వారి చదువులు పూర్తికాలేదు. వారికి ఉద్యోగములు రాలేదు. నేనింకను 'రిటైర్' కాలేదు, ఈ ప్రకారముగా పరమాత్మ ధ్యానమునకు మీనమేషములు లెక్కించుకొనుచుండినచో మహాప్రమాదము ఘటిల్లగలదు.

కావున విజ్ఞుడగువాడు బాగుగ యోచించి అమూల్యమగు ఈ మానవజీవితమును భోగములందుగాక యోగమునందే వినియోగించి గురూపదిష్ట మార్గము ద్వారా ఆత్మజ్ఞానమును శీఘ్రముగ సంపాదించి జన్మసాఫల్యమును బొందవలెను. భగవంతుని పాదపద్మములను ఆశ్రయించి భవరోగమును బాపుకొనవలెను. అతిసూక్ష్మ రూపుడును, నిర్మలుడును, విశ్వాధారుడును నగు పరమాత్మను తన హృదయమందు క్షణకాలమైనను ధ్యానింపనివాని జీవితము నిరర్థకమే యగునని పూర్వము శుకులవారు ఆనతిచ్చి యుండిరి. ప్రాపంచిక భోగవిలాసములందు నిమగ్నుడుకాని మనుజుని జీవితము వ్యర్థమని రంభ పలుకగా, ఆమె వాక్యములను

ధిక్కరించి శుకులు పై విధముగా పలికిరి. శుకుని వాక్యములు పరమసత్యములు. రంభ పలుకులు అజ్ఞానిభావమునే ప్రతిబింబింప జేయుచున్నవి. శుకుని వాక్యములు శాస్త్ర సమ్మతములై జ్ఞాని యొక్క భావమునే వ్యక్త మొనర్చుచున్నవి. అజ్ఞాని మాయకు లోబడియున్నందున దృశ్య పదార్థమునే సత్యమని నమ్మి, విషయానందమునే తన జీవితలక్ష్యముగ నొనర్చుకొనుచున్నాడు. బాగుగా విచారించి చూచినచో ఆ విషయము లందలి సుఖము కేవలము మనఃకల్పితముగనే తేలుచున్నది.

"రోగశాంతికరకృత్యము భోగమనంగజెల్లునే"

అని భర్తృహరి ప్రశ్నించుట చాల సమంజసముగానే యున్నది. ఆకలి, దప్పిక మొదలగు వ్యాధులకు భోజన పానాది ప్రతీకారచర్యల నొనర్చుచు అట్టి ప్రతీకార చర్యనే సుఖమని తలంచి మానవుడు భ్రమించు చున్నాడు. వాస్తవముగ అది సుఖము కాదు. సుఖాభాసమే. సుఖము భగవంతుని పాదపద్మములను సేవించుటయందే కలదు. హృదయమందు, సమస్త చరాచరములందు వెలుగొందుచున్న పరమాత్మను భజించుటయందే కలదు. అట్లు భజించువాడు, **'సుఖమక్షయ మశ్నుతే'** అనునట్లు అనంతసుఖమును బడయుచున్నాడు. కనుకనే శాస్త్రములు, అనుభవజ్ఞులగు మహనీయులు –

'ఉత్తిష్ఠత! జాగృత! ప్రాప్యవరాన్ నిబోధత!' లెండు! మేలుకొనుడు! మహాత్ములకడకేగి ఆత్మవిజ్ఞానమును శీఘ్రముగ బడయుడు' అని ముక్త కంఠముతో బలుకుచున్నారు. కావున ఇట్టి వేదాంతగర్జనము నాలకించి తమస్సును పారద్రోలి ముకుంద పాదపద్మములను శీఘ్రాతి శీఘ్రముగ నాశ్రయించవలెను. అజ్ఞానకుహరమునుండి వినిర్గతులై ఆత్మప్రకాశమును సత్వరమే అనుభూత మొనర్చుకొనవలెను. ఏ మాత్రము జాగుచేయరాదు.

ఇంద్రియ నిగ్రహము

- శ్రీమలయాళ స్వాములవారు

ఇంద్రియములు మలినములనియు, శుద్ధములనియు, విశుద్ధము లనియు మూడు తరగతులుగా నున్నవి. మలినావస్థలో ఉండునప్పుడవి యెల్లప్పుడును దృశ్యవిషయములతో గూడి యుండును. ఆ విషయములు మలినములుగా, దుష్టములుగా నుండును. ఈ అవస్థలో ఇంద్రియములు రజస్తమోగుణములతో కూడి యుండును. పుణ్యసంస్కారముచే శుద్ధము లగునప్పుడవి ధర్మబద్ధములుగా నుండును. ఇచ్చట నుండియే ఇంద్రియ నిగ్రహము ప్రారంభమగును.

అప్పుడు కర్ణేంద్రియము మంచిమాటలను, సత్యవాక్యములను మాత్రమే వినుట అభిలషించును. చెడుమాటలు వినుటనుండి మంచి మాటలలోనికి మరలించుటయే కర్ణేంద్రియ నిగ్రహమనబడును. స్పర్శేంద్రియ మనబడు దృశ్యవిషయములనుండి మరలించుటయే దాని యొక్క నిగ్రహమగును. మృదు, సుగంధ, సుందరములైన పదార్థములనుండి కూడ మరలించుకొనవలెను. నేత్రేంద్రియమును చెడుచూపుల నుండి మరలించి మంచి భావముతో చూచుటే దానియొక్క నిగ్రహ మగును. రసనేంద్రియములను రుచులకు వశము చేయక జ్ఞాననిష్ఠకనుకూలమగు పదార్థముల లోనికి మరలించుటయే దానియొక్క నిగ్రహమగును. ఘ్రాణేంద్రియమును అపవిత్ర వాసనలనుండి మరలించుటే దాని నిగ్రహమగును. ఇవియన్నియు జ్ఞానేంద్రియ లనబడును.

ఆలాగున వాగింద్రియమును అసత్య, అక్రమ, క్రూరాది వచనములనుండి మరలించి సత్య, శాంత, ప్రియ, దైవ వాక్యములలోనికి

చొప్పించి, అమితముగా మాటలాడు స్వభావమునుండి మితముగా మాటలాడునట్లు చేసికొనుటయే వాగింద్రియ నిగ్రహమగును. పాణీంద్రియమును పాపకృత్యము చేయనీయక పుణ్యకార్యములలోను, దానకార్యములోను, దైవకార్యములోను ప్రవేశపెట్టుటే దానియొక్క నిగ్రహమగును. పాదేంద్రియమును వ్యర్థ స్థలములలోనికి నిషిద్ధ స్థలములలోనికి పోనివ్వక ధర్మస్థలములలోనికి, పుణ్యస్థలములలోనికి, లోకోపకారస్థలములోనికి పోనిచ్చుటయే దాని యొక్క నిగ్రహమగును. ఉపస్థేంద్రియమును దేహసంరక్షణ కనుగుణముగా మూత్రవిసర్జన మునకును, కేవల ధర్మబద్ధగృహస్థ నియమిత కార్యములలోను వినియోగపరచుటయు, ధర్మవిరుద్ధ కార్యములో ప్రవేశింపనివ్వక చూచుటయు, దానియొక్క నిగ్రహమగును. అలాగున పాయ్వింద్రియమును కూడ దేహసంరక్షణకు తగిన మలవిసర్జనమునకు మాత్రము వినియోగపరచి మార్గములలోను, ధర్మస్థలములలోను మలవిసర్జనము చేయక చూచుటయే వానియొక్క నిగ్రహమగును. ఇవి ఐదును కర్మేంద్రియము లనంబడును. ఈ నిగ్రహమునకే దమమని పేరు.

ఈలాగున మనస్సు చెడు విషయముల సంకల్పించక మంచి విషయములను, పుణ్యవిషయములను, ధర్మవిషయములను సంకల్పించుటయే దానియొక్క నిగ్రహమగును. ఆలాగున బుద్ధిని, దుష్టవిషయములను నిర్ణయము చేయనీయక వానినుండి మరలించి సత్య, జ్ఞాన, ధర్మాదివిషయముల నిర్ణయములో ప్రవేశింపజేయుటే దాని నిగ్రహమగును. ఆలాగున చిత్తమును, పాపచింతనమును చేయనీయక పుణ్యకార్య, దైవకార్య, విద్యాకార్యములను చింతనము చేయుటయే దానియొక్క నిగ్రహమగును. ఆలాగున అహంకారమును, దేహమునకు సంబంధించిన అభిమానములగాని, అంతరగుణములనుగాని తలంచి

Scanned by CamScanner

అహంకరింపనీయక జ్ఞాన, యోగాదులయందు ప్రవేశించేలాగున జేసికొని పరిశుద్ధ జీవిని గురించి అభిమానము కలిగియుండేలాగున జేసికొనుటే దానియొక్క నిగ్రహమగును. దీనికే అంతరింద్రియ నిగ్రహ మనియు, శమమనియు పేర్లు గలవు. ఈలాగున సేయుటే ఇంద్రియనిగ్రహమని గ్రహించవలెనుగాని, ఇంద్రియముల నశింపజేయుటగాదు, కృశింప జేయుటయును గాదు. అది మూఢత్వము లేక మూర్ఖత్వమనియే గ్రహించవలెను.

ఈ సంగతి తెలియక కొందరు ఇంద్రియములను ధ్వంసమొనర్చు చున్నారు. అది అసుర స్వభావము. పై జెప్పిన లాగున అన్ని ఇంద్రియములను శుద్ధములనుగా జేసికొనుటే న్యాయమైన ఇంద్రియ నిగ్రహమగును. ఇది సత్త్వగుణము కల్గునప్పుడేర్పడును. ఇట్టి యవస్థ కల్గిన ఇంద్రియములన్నియు శుద్ధములగును. అట్టి తరుణమున శుద్ధదర్పణమందుగాని, స్వచ్ఛజలమందుగాని సూర్యప్రతిబింబము కన్పించునట్లు ఆత్మలో దైవజ్ఞానము కనుగొనందగును. ఈ స్థితికి వచ్చినవారికి దుఃఖము కలుగదు. ఎల్లప్పుడును ప్రశాంతులై, ప్రసన్నులైనవారికి నిర్మల దైవసుఖమనుభవములోనికి వచ్చును.

ఇదే ఇంద్రియ నిగ్రహ రహస్యము. నిగ్రహ మనగా స్వాధీనములో నుంచుటయే యని యర్థముగాని, ధ్వంసమొనర్చుటయని యర్థముగాదు. ఋషులందరికిని నేత్రేంద్రియాదులుండలేదు? యోగీశ్వరులందరికిని కర్ణేంద్రియ ముండలేదా? అది లేనిచో శుకబ్రహ్మర్షి ఏలాగున శ్రీమద్భాగవతమును ఉపదేశించకల్గెను. సనకాది యోగులకు ఘ్రాణాదీంద్రియము లుండలేదా? అట్లు కానిచో వారేలాగున యోగశాస్త్రములను రచింపకల్గిరి. ఆలాగున పతంజలి మహామునికి మనసేంద్రియాదులు లేనిచో ఎట్లు యోగదర్శనము, వ్యాకరణ మహాభాష్యమును వ్రాయకల్గెను? అట్లే శ్రీవ్యాసమహర్షికి బుద్ధ్యాదీంద్రియములు లేనిచో ఏలాగున శారీరక

సూత్రములను రచింప కల్గిరి. ఇదేరీతిగా దత్తాత్రేయాది మహనీయులు అవధూత వృత్తిలో నుండియు చిత్తాదీంద్రియములు లేనిచో అవధూతగీతాది గ్రంథములను ఎట్లు నిర్మింపకల్గిరి.

ఇట్లే శ్రీ వసిష్ఠయాజ్ఞవల్క్యాదిమహర్షుల చరిత్రములను గ్రహించుకొన వచ్చును. మరియు వాగింద్రియము లేనిచో మైత్రేయి ఏలాగున యాజ్ఞవల్క్యునితో వేదాంత జ్ఞానమడిగి తెలిసికొనకల్గెను. బృహదారణ్యకోపనిషత్ ఈ విషయమునే తెలుపుచున్నది. ఇంద్రియములు లేనిచో సులభ ఏలాగున జనకునితో బ్రహ్మవిషయమై చర్చచేయకల్గెను. ఆలాగున గార్గేయి, ఋషిమండలిలో వేదాంత ప్రసంగమున కెట్లుపక్రమించెను? ఛాందోగ్యమున భారతమున ఈ విషయములు కనిపించుట లేదా? (సశేషం)

త్రినేత్ర వైద్యాలయ ట్రస్టుకు ఈ క్రింది వారు పైకం పంపినారు

1. మహాలక్ష్మి (హైద్రాబాద్) – రూ. 15,000-00
2. వి.దేవేంద్రప్ప (బళ్ళారి) – రూ. 15,000-00
3. గంగుల గోవర్ధన్ (కూకట్‌పల్లి, హైదరాబాద్) 15,000-00

సద్గురు సేవాట్రస్టుకు ఈ క్రిందివారు పైకం పంపినారు

1. బి.రామకృష్ణ (విశాఖపట్నం) – రూ. 20,000-00
2. జి.యస్. రామచంద్రన్ (చెన్నై) – రూ. 25,000-00
3. వి.దేవేంద్రప్ప (బళ్ళారి) – రూ. 10,000-00

వేదాంతభేరికి ఈ క్రిందివారు పోషక చందా పంపినారు

1. జి.యువరాజు (నారాయణవరం) – రూ. 1,500-00
2. కె.మహాలక్ష్మి (హైదరాబాద్) – రూ. 1,500-00
3. కె.పి.పార్థసారథి(విశాఖపట్నం) – రూ. 1,500-00
4. జి.రంగస్వామి (హైదరాబాద్) – రూ. 1,500-00
5. బి.మురళి (జూలేపల్లి, కర్నూలు జిల్లా) – రూ. 1,500-00

Scanned by CamScanner

వాడే సుఖవంతుడు

- శ్రీవిద్యాస్వరూపానందగిరి స్వాములవారు

లోకంలో ప్రతివాడు ఏపని చేసినా ఒక ప్రయోజనాన్ని కోరే చేస్తున్నాడు. ప్రయోజనాన్ని ఆపేక్షించకుండా చేసే పనేలేదు. అలాంటప్పుడు తత్త్వతః ఈ లోకంలోని సర్వకార్యాల ప్రయోజనమేమి? ప్రాణి ఏ మూలప్రయోజనాన్ని అపేక్షించి ఈ కర్మ రచనను, ఈ జీవయాత్రను సాగిస్తూంది?· సుఖాన్ని కోరి అని సమాధానం. మూలప్రయోజనం, ఉద్దేశ్యం అందరికీ సుఖమే. ఆ సుఖం అందరికీ లభించడం లేదే. కొందఱికి లభించినా అది నామమాత్రంగానే వుంది. కాబట్టి అది సుఖం కాదు, సుఖాభాస. ఎట్లు? నిజమైన సుఖం లభిస్తే మరల దాని ప్రక్కన దుఃఖముండకూడదు గదా! దీపపు వెలుగు, సూర్యకాన్తి ఉన్నచోట చీకటి ఉండదుకదా!

అయితే నిజమైన సుఖం ఎలా లభిస్తుంది? ఎప్పుడు లభిస్తుంది? ఈ విషయాన్ని మనం గీతామాతనే అడుగుదాము. ఆమె సమాధానమిది "శక్నోతీహైవ యస్సోఢుం ప్రాక్ఛరీరవిమోక్షణాత్। కామక్రోధోద్భవం వేగం సయుక్త స్ససుఖీ నరః" అనగా ఎవడీ మానవశరీరమందే ఇచటనే శరీరం చావకముందే కామక్రోధోద్భవవేగాన్ని సహిస్తాడో, కామక్రోధాల వేగానికి ప్రభావితుడుకాడో, కామక్రోధాలు కలిగినా వానిచే చలింపక, వానికి లోనుగాక, వానినేమాత్రం పట్టించుకోక, తనను కాదన్నట్లుండగలడో వాడు సుఖవంతుడు. వాడే మానవుడు, యోగియు. దీనికి వ్యతిరేకంగా కామక్రోధతరంగాలకు లోనైన వాడు సుఖి-సుఖవంతుడు కాలేడు· అని అర్థము.

మన అందఱి లక్ష్యం సుఖమేగదా! అట్లయితే మనమున్న పైన చెప్పిన భగవద్వాణిని అమలునందుంచవలసినదే. దీనినాచరణలో వుంచబట్టే గాంధీజీ మహాత్ముడనబడ్డాడు, మన ప్రాచీన ఋషులు మాన్యులైరి. ప్రపంచంలోని గొప్ప మహాత్ములు, ప్రవక్తలు ఈ ప్రక్రియ నాచరించే లోకారాధకులైరి. కాబట్టి ఒక్కమారు యోచించండి, గత చరిత్రలను పరిశీలించండి. ఈ కామక్రోధాలచేతనే గదా మహా యుద్ధాలు జరిగాయి. రామరావణయుద్ధం తత్ఫలితమేగదా! అరాచకత, దేశమున కల్లోలాలు, మారణహెూమాలు ఈ కామక్రోధ ఫలితాలే కదా! ఇంతేల మీ ఇంటిలోని, ఒంటిలోని అలజడులకు మూలకారణమేమిటో ఒక్కమారు విచారించండి. ఏకాంతంలో కూర్చొని ఒక్కమారు పరిశీలించండి.

అయితే ఈ కామక్రోధాల విషయం రెండువిధాలుగా విచారించాలి. అందొక మార్గం నివృత్తపరులది. నివృత్తిమార్గంలో సర్వసంకల్ప సన్న్యాసం కావలసిందే. అది తప్పనిసరి. మరి ప్రవృత్తిపరులకో ఫలాన్ని అపేక్షింపక విధ్యుక్త కర్మల ఆచరించుటయందు కామముండవలసినదే. అనగా "ధర్మావిరుద్ధో భూతేషు కామోఽస్మి భరతర్షభ" ధర్మవిరుద్ధంకాని కామం వారికుండాలి. ఇట్టి ధర్మానికి విరుద్ధంకాని కామమందు, అంటే ధర్మంతో కూడిన కామమునందు వేగం ఉండదు. క్రోధమో పరిపూర్ణత్యాజ్యమే. ఇచట మీకొక ప్రశ్న కలగవచ్చు. వ్యవహార రంగంలో పొరబాటు చేసిన వానిని దండించవలదా? కోపగించవలదా? అని. దండించవలసినదే. కాని అది కోపమనబడదు. న్యాయాధిపతి దోషిని దండిస్తాడు. కానీ ఆ దండనలో దోషిపై న్యాయాధిపతికి ఏలాటి క్రోధం వుండదు. అతని మనోభావంపై క్రోధం యొక్క ముద్రలేదు. అతని మనస్సు క్రోధంతో వికృతం -వికారవంతం కావడంలేదు. కాని క్రోధం కలిగిన మనిషి మనస్సు ఎంత ఉద్వేగవంతం అవుతుందో, ఆతని శరీరంపై దాని ప్రభావం వుంటుందో

మనం చూస్తూనే వున్నాం. కోపావేశంలో మీముఖాన్ని అద్దంలో చూడండి. కండ్లెఱ్ఱబడి చింతనిప్పులవలె వుండగా, ముఖం కంది, మెడనరాలు వుబ్బి, దేహం పదురుతూ వుంటుంది. ఇది క్రోధవేగం. ఇట్టి వారికి శాన్తి, సుఖం ఎలా కల్గుతుంది?

ఈ కామక్రోధాగ్ని గురించి గీతలో చెప్పినది చూదుడు. రెండవ అధ్యాయంలో స్థితప్రజ్ఞుని లక్షణాలు చెప్తూ దీని చిత్రణ చేశాడు. కామమనేది ఒక అల, మానసిక అల అది. దీనిచే మానవుని తృప్తి అడుగంటి పోతుంది. కామనలు కలుగడం ప్రకృతి సహజం. వానిని పుట్టినట్లే వుండనీయండి. పుట్టినవి మరలా గిట్టును. మీరు వాని వేగానికి లోబడకండి. తటస్థంగా వుండండి. వచ్చిన దానికి పోకడ తప్పదు. వచ్చినది వచ్చినట్లే మరల పోతుంది. అలా కాక మీరు దానికి లోబడితే ఆ వేగపు సుడిలో మీరు తగుల్కొని సముద్రంలో తుఫానుకు గురైన నావవలె మీరున్ను అధఃపతనం కావలసిందే, సంసార సముద్రంలో మునిగిపోవలసిందే. తుఫానుకు గురైన నావవలె మీరున్ను కామనలవేగానికి గురి అయితే ఆ సుడి, ఆ ఉప్పెన తీసుకు వెళ్ళిన చోటికి మీరున్ను వెళ్లక తప్పదు. అశాన్తికి గురిగాక తప్పదు. "కామాత్క్రోధోభిజాయతే, క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతి విభ్రమః, స్మృతి భ్రంశాద్బుద్ధినాశః బుద్ధినాశాత్ప్రణశ్యతి"– విషయాలందు కామం కోర్కె కలిగినవానికి ఆ కోరిక నెరవేరనప్పుడు, దాని కడ్డువచ్చినవారిపై క్రోధం కల్గుతూంది. క్రోధం వలన మోహం వుంటుంది, మోహం వలన స్మరణ శక్తి నశిస్తుంది, స్మృతి భ్రంశంచే బుద్ధి నశిస్తూంది, బుద్ధి నశించడంచే తుదకు తానే నాశమవుతున్నాడు" అని గీతలో కామక్రోధాలకు లోబడిన వాని స్థితిని చక్కగా విశదపఱచాడు. ఈ వేగం ఒక విషపు వేగం. పాము కఱచిన దాని విషం ఎలా నరనరానికెక్కునో అలా కామక్రోధాల వేగం కూడ, విషంకూడ సరసర తలకెక్కి ప్రతిక్రియలకు గురి అవును. క్రోధావిష్టునికి యుక్తాయుక్తజ్ఞానం, వివేకం నశిస్తూంది. క్రోధపు కైపులో

ఏది చేయతగింది, ఏది చేయతగనిదనే బుద్ధి వుండదు. నిజానికి తానేమి చేస్తున్నాడో తనకే తెలియదు. చేయరానిపని చేసిన తరువాత కైపు దిగిన తరువాత తాను చేసిన దానికి పశ్చాత్తాపపడుతాడు. చేయి కాలిన తరువాత తడుముకుంటే లాభమేమి. ఈ కామక్రోధ వేగానికి లోబడేగదా రావణుడు తాను నాశనమైందిగాక తన రాజ్యాన్ని, తన కులాన్ని సర్వనాశనం చేశాడు. కామక్రోధాలకు గురైనవాడు తాను అశాంతిని, దుఃఖాన్ని పొందిందేగాక ఎదుటి వారికిన్ని ఆశాన్తిని, దుఃఖాన్ని కలిగించాడు. ఇచట తనకు గాని, ఎదుటివానికి గాని సుఖం ఎక్కడ? శాన్తి ఎక్కడ?

వైద్యశాస్త్రరీతిగా కూడ క్రోధం చేసే హాని అంతింత కాదు. చరకుని మతానుసారం ప్రజ్ఞా అపరాధమునకు ఈ కామక్రోధాలే ముఖ్యంగాలు. ప్రజ్ఞాపరాధ ఫలితం (శారీరక) సర్వదోష ప్రకోపం. "ధీ ధృతి స్మృతి విభ్రష్టః కర్మ యత్కురుతేஉ శుభం ప్రజ్ఞాపరాధం తం విద్యాత్ సర్వదోష.ప్రకోపణమ్". కాబట్టి బుద్ధి భ్రష్టుడు, స్మృతి భ్రష్టుడు ఈ ప్రజ్ఞాపరాధాన్ని చేస్తాడు. కామంచే క్రోధం, క్రోధంచే బుద్ధి భ్రంశత, స్మృతి భ్రంశత కలుగుతూందని గీతావాక్యం. ఈ ప్రజ్ఞాపరాధాన్ని వివరిస్తూ "కర్మకాల నిపాతశ్చ..." ఇన్ద్రియలోలత్వం, క్రోధం, ఈర్ష్య, భయం, లోభం, మదం మొదలైనవి ప్రజ్ఞ అపరాధాలనీ, వానిచే సర్వరోగాలు ఉత్పన్నాలవుతున్నవని చరకుడు చెప్పియున్నాడు.

మరొకచోట "ఈర్ష్యాభయక్రోధపరిప్లుతేన లుబ్ధేన మాంద్యేన పీడితేన। ప్రద్వేషయుక్తేన చ సేవ్యమానమప్యన్నం న సమ్యక్పరిపాకమేతి" – ఈర్ష్యా భయక్రోధాదులతో కూడుకొనినవారు ఎంతమంచి ఆహారాన్ని తిన్నా అది పక్వం కాదు, ఒంట బట్టదు. వానికి అగ్నిమాంద్యాది జీర్ణాశయ రోగాలు ఉత్పన్నాలవుతవి" అని నుడివియున్నారు. ఎందుకంటే క్రోధం కలవాని మనస్సు క్రోధం యొక్క వేగానికి లోనైతే వెంటనే మనోవేగాన్ని అనుసరించి కొందరు ఉద్విగ్నులవుతారు. కాబట్టి ఆ వేగానికి మెదడు

రక్షింపబడుటకై రక్తం అధికంగా మెదడువైపు ఒక్క దమ్మున పరుగెత్తుతుంది. ఆ రక్తాధిక్యత ఒత్తిడికి ముఖం కందుతుంది. కండ్లు ఎరుపెక్కును, కణతలందలి నాడులు ఉబికి కనిపించును. శరీరంలో రోమాంచనం 'అదరడం సంభవించును. ఉద్వేగాన్ని చెందిన మెదడును రక్షించుటకై రక్తం అధికంగా మెదడువైపు పరుగెత్తుటచే క్రింది అవయవాలలో రక్తప్రసారం దుర్బలమవుతూంది. మెదడులో ఈ వేగప్రకోపంచే, భావప్రకోపంచే, రక్తం వేగాధిక్యతతో ఒక్కమారు ఉరుకుటచే నాడులన్ని ఉన్నట్లుండి కలుగు అందురుపాటుకు 'దెబ్బతినుచున్నవి. అతిగా కల్లు త్రాగినవాని నరములవలె అతికాముకుని నరాలు, అతికోపి యొక్క నరాలు త్వరలో దెబ్బతింటున్నవి. దాని ఫలితం అసహనం వగైరా.

చూచితిరా! ఇట్లు శరీరారోగ్యనష్టం, అట్లు ఆధ్యాత్మిక నష్టం కలుగుటచేత ఈ కామక్రోధ వేగములకు లోనైనవాడు శాన్తిని ఎట్లు పొందును? సుఖాన్ని ఎలా పొందును? కాబట్టి ఆత్మీయులారా! మీరు సుఖవంతులు కావలయునంటే గీతలో పైన చెప్పిన ఆ కామక్రోధ వేగాలకు గురిగాక యుండుడు. వానిచే లవలేశమున్ను ప్రభావితం కాక "జహి శత్రుం మహాబాహెూ కామరూపం దురాసదం" అన్నట్లు ఆ కామక్రోదాధి మహాశత్రువులను జ్ఞానఖడ్గంతో నరికివేయుడు. నరకద్వారాలైన ఆ కామక్రోధలోభమోహాలను మొదలంట త్రుంచివేయుడు. వాని దుంపనాశం పూర్తియగులోపల వానిని ఉపేక్షించి వానివేగానికి, తాకిడికి లోనుగాక యుండుడు. ఇట్లుండడం మీరు భగవంతుణ్ణి ఆశ్రయించినప్పుడే, తత్త్వజ్ఞానాన్ని పొందినప్పుడే పూర్ణంగా సిద్ధించును. కాబట్టి ఈ క్షణం నుండి ఒకవైపు తత్త్వజ్ఞానాన్ని, భగవంతుణ్ణి ఆశ్రయించుడు, మరోవైపు కామక్రోధవేగాల నణచుడు. అపుడే మీరు సుఖవంతులు కాగలరు.

- ఓం -

వేదపరిచయము

- శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

(గతసంచిక తరువాయి)

ఋగ్వేదము

ఋచ్యతే స్తూయతే యయా సాఋక్ తాదృశీనాం
ఋచీనాం సమూహః ఏవ ఋగ్వేదః ।
అర్చ్యతే ప్రశస్యతే అనేనదేవ విశేషః ।

ఋగ్వేదమునందు 10,580 1/4 మంత్రాలున్నాయి.
(మొత్తం వేదంలో 20,417 మంత్రాలున్నవి)

1. మండల ప్రకారము
   10 మండలాలు / 856 అనువాకాలు / 1028 సూక్తాలు

2. అష్టక ప్రకారము
   8 అష్టకాలు / 64 అధ్యాయాలు / 2009 వర్గలు

   1,53,826 శబ్దములున్నాయి
   4,32,000 అక్షరములున్నాయి
   (కలియుగ కాలపరిమాణం 4 లక్షల 32 వేలే)

   ఋగ్వేదస్య ఉపవేదః ఆయుర్వేదః
   ఋగ్వేదమంత్రపాఠకుని హెూతాం అనియు
   ఐతరేయ బ్రాహ్మణము

యజుర్వేద పరిచయము

యజ దేవపూజాసంగతికరణదానేషు
అనుధాతువు వలన యజుశ్శబ్దము ఏర్పడును.

1. దేవతలనబడు దివ్యగుణపదార్థములను, వ్యక్తులను పూజించుట, 2.జడచేతన పదార్థములను సమీకరించుట, 3. దానము చేయుట యజుఃవేదం యజుర్వేదం కర్మకాండను ఉపదేశిస్తుంది, ఇహలోక, పరలోక ఉన్నతిని బోధిస్తుంది.

యజ్ఞయాగాది కర్మకాండను బోధించునది
యజుర్వేదః యజ్ఞోపయోగిత్రంసూపయోగాత్

40 అధ్యాయములు / 303 అనువాకాలు
1975 కండికలుగాను (మంత్రాలు గాను)

జైమినీ సూత్రం శేషే యజుశ్శబ్దః

కేవలం మంత్రాత్మకమైనది / శుక్లయజుర్వేదము. బ్రాహ్మణభాగం సమ్మిశ్రితమైనది కృష్ణయజుర్వేదం.

యజుర్వేదస్య ఉపవేదః ధనుర్వేదః. యజుర్వేద మంత్ర పాఠకుని అధ్వర్యుడనియు శతపథ బ్రాహ్మణము.

సామవేద పరిచయము

సామ్నో ఉద్గీథోరసః
సా చ అమశ్చేతి తత్సామ్నః సామత్యం
1. సా అంటే ఋక్,
2. 'అమ' అంటే గాంధారాది స్వరాలు ।

గీతిషు సామాఖ్యా అని జైమిని సామశబ్దానికి గానమనే అర్థం చేశారు. వేదానాం సామవేదోఽస్మి

సామవేదే గీతి ప్రధానే, ఆవృత్తిషు + అర్థో నాద్రియతే ।

సామవేదస్య ఉపవేదః గాంధర్వవేదః

(యత్ ఖలు సాదు తత్సామ । ఏది శుభావహమో శోభనమో అదియే సామమని చెప్పబడినది)

సామవేదము 2 భాగాలు । పూర్వార్చిక । ఉత్తరార్చిక । 1.పూర్వార్చికలో - 640 మంత్రాలు । 6 ప్రపాఠకాలు । 12 అధ్యాయాలు। 59 దశతులు 2. ఉత్తరార్చికలో మొత్తం 1225 మంత్రాలు 9 ప్రపాఠకములు । 22 అధ్యాయాలు । 120 దశతులు

సామగాయకుని ఉద్గాత యనియు తాండ్యబ్రాహ్మణము.
సామవేదస్య ఉపవేదః గాంధర్వవేదము.

అధర్వణవేద పరిచయము

వేదత్రయీ పరానంద । (గీ.మా.) త్రయోవేదా అజాయన్త(త్రై.బ్రా.)

ముండకోపనిషత్తు - తత్రాపరాఋగేదో యజుర్వేదః సామవేదోఽథర్వవేదః।

బృహదారణ్యక ఉపనిషత్తు-అస్యమహతో భూతస్య నిఃశ్వసితమేతద్ ఋగ్వేదో యజుర్వేదః సామవేదోఽథదర్వాంగిరసః । అధర్వ వేదజ్ఞుని బ్రహ్మయని పిలుతురు.

అధర్వవేదజ్ఞుడగు బ్రహ్మ యజ్ఞములో సాక్షిమాత్రముగానుండును.

అధర్వణవేదం

1. పారలౌకికమైన విషయాలను, ఐహిక సుఖాలను సమంగా విశ్లేషించేది. బ్రహ్మవేదం భిషగ్వేదం క్షత్రవేదం ఇవన్నీ నామాంతరాలు.

2. రాష్ట్ర, రాజ్యపాలనా వ్యవహారాలను తెలియజేసేది. ధర్వ దాతువు కుటిలత, చలనం, కదలిక మరియు హింస అని అర్థము.

అధర్వ - అకుటిలత, అచలనం, అహింస అనే అర్థముచే పరబ్రహ్మమును పొందుటకు

1200 మంత్రాలు / 118 సూక్తాలు / 20 కాండలు.

అధర్వవేదజ్ఞుని బ్రహ్మయని పిలుతురు. గోపథబ్రాహ్మణము.

అధర్వవేదస్స ఉపవేదః - అస్త్రశస్త్రవిద్య

Scanned by CamScanner

భాగవతం - 6వ స్కంధం

శ్రీమాతా పరావిద్యానందగిరి
(యాజ్ఞవల్క్యాశ్రమము)

(గతసంచిక తరువాయి)

అజామిళోపాఖ్యానము

పరీక్షన్మహారాజు శుకుని ప్రశ్నించుచున్నాడు. ఓ మహర్షీ! మానవుడు తాను చేసిన పాపములకు రాజదండనము, సమాజ దండనము మొదలైన లౌకికమైన శిక్షలను, పారలౌకికమైన నరక బాధలరూపమైన కష్టములను తెలిసికొనినను పాపవాసనలచే ప్రేరేపింపబడినవాడై పదే పదే పాపకృత్యములను ఆచరించుచుండును. అటువంటి సమయమున అతడు పాపకర్మలకు ప్రాయశ్చిత్తము చేసికొనిననూ, ఏనుగు తన తొండముతో ఎత్తి పెద్ద పెద్ద నీటిధారలను తనమీద చల్లుకొనుచూ గంటల కొలది స్నానము చేసిననూ మరల నీటిస్థావరము నుండి బయటకు రాగానే ఆ తొండముతోనే ఎత్తి దుమ్ము చల్లుకొనును, అట్లు చేయుట వలన దాని స్నానము వృథా అయినట్లుగా ఈతని ప్రాయశ్చిత్త కర్మలు వ్యర్థమే కదా!

అందులకు సమాధానముగా శుకమహర్షి - ఓ రాజా! కర్మల యొక్క మూలము అజ్ఞానము. అందువలన కర్మలచేత కర్మలు నాశనమొనర్పబడవు. నిజమైన ప్రాయశ్చిత్తము, పాపముల సమూల నాశనమునకు వుపాయము యథార్థమైన ఆత్మజ్ఞానమే.

వెదురు పొదల నుండి పుట్టు అగ్ని ఆ వెదుళ్ళనే కాల్చివేయునట్లు తపస్సు, బ్రహ్మచర్యము, శమదమాదులు, దానము, బాహ్యాభ్యంతర

శౌచము, సత్యము, యమనియమాదులు మొదలైన సాధనలచేత ధర్మము తెలిసిన తత్త్వజ్ఞానియైన ధీరుడు పాపములను సమూలముగా నాశనమొనర్చుకొని శుద్ధుడగును.

దీనిని మించిన సులభతమ ఉపాయము భగవంతుని సంపూర్ణ శరణాగతి పొందుట. కల్లుతో నిండిన కుండను ఎంత శుద్ధ గంగాజలమైననూ పవిత్రమొనర్ప జాలనట్లు పై తెలిపిన సాధనలన్నియు భగవద్భక్తి లేనివానికి నిరర్థకములే యగును. కనుక భగవద్భక్తుల సేవించుచూ భగవంతునకు ఆత్మ సమర్పణ చేసికొన్న భగవద్భక్తులు అంతఃకరణ శుద్ధిగలవారై పాపవిముక్తులగుదురు. ఆతడు కలలో కూడా యమభటులను గాని, యమునిగానీ చూడడు. ఇందులకు ఉదాహరణగా ఒక ప్రాచీనగాథ చెబుతాను విను -

కన్యాకుబ్జమనే నగరములో ఒక దాసీ భర్తయైన అజామిళుడు అనే బ్రాహ్మణుడు ఉన్నాడు. దాసీతో సంపర్కము పెట్టుకొన్న దోషము వలన ఆతడు ధర్మభ్రష్టుడయ్యెను. కపటజూదముతోను, మోసముతోను సంపాదించిన ధనముతో, బాటసారులను దోచుకొన్న ధనముతో భార్యాబిడ్డలను పోషించుకొనుచుండెడువాడు.

ఈ విధముగా కాలము గడుపుచున్న ఆతనికి ఎనుబది ఎనిమిది సం॥లు వచ్చినవి. ముదుసలియైన ఆ అజామిళునికి కలిగిన పదిమంది సంతానములో చిన్నవానిపేరు నారాయణుడు. తల్లిదండ్రులిద్దరికీ ఆతనిపై అమితప్రేమ. ఆ కొడుకు చింతనలో, ఆతని లాలన పాలనలో ముసలివాడినైనాను, మృత్యువు వచ్చునను విషయము కూడా మరచిపోయెను ఆ అజామిళుడు.

కాలము ఎవరి కొఱకూ ఆగదు. ఆ అజామిళుని నరకమునకు తీసికొని పోవుటకు యమధర్మరాజు యొక్క అనుమతితో నిక్కబొడుచుకొన్న రోమములతో, అతివికారమైన ముఖములతో పాశములను ధరించి భయంకరాకారముతో ముగ్గురు యమభటులు వచ్చుటను చూచి వ్యాకుల చిత్తముతో సమీపములో ఆడుకొనుచున్న తన ప్రియపుత్రుని గొంతెత్తి బిగ్గరగా "నారాయణా!" అని పిలిచెను.

ఆ నామమును శ్రీహరి దూతలు విని తమ ప్రభువుని స్మరించు చున్నవారు ఎవరా అని ఆతని రక్షించుటకు అక్కడకు వచ్చిరి. అప్పటికే అజామిళుని శరీరమునుండి యమదూతలు ఆతని సూక్ష్మశరీరమును లాగుచుండిరి. వారిని విష్ణుదూతలు అడ్డుకొనిరి.

ఆ విష్ణుదూతలు నలుగురు. వారందరూ శ్రీమహావిష్ణువువలె పట్టుపీతాంబరములు, చెవులకు కుండలములు, శిరస్సులపై కిరీటములు, కంఠములయందు హారములతో దేదీప్యమానముగా ప్రకాశించుచున్నారు. అంతియేగాక నవయువకులుగా వుండి శంఖం, చక్ర, గదా పద్మములతో కూడిన చతుర్భుజములతో శోభిల్లుతూ ధనుస్సులను, తూణీరములను, ఖడ్గములను కూడా ధరించియుండి వారి దేహకాంతులతో దిక్కులందలి చీకట్లను తొలగించుచున్నారు.

వారిని చూచి ఆశ్చర్యపడి యదూతలు మీరెవ్వరు? యమభటుల మైన మమ్ములను అడ్డగించుటకు కారణమేమని అడిగిరి.

అందులకు విష్ణుదూతలు మీరు యథార్థముగా ధర్మరాజు యొక్క ఆజ్ఞను పాటించువారైనచో మాకు ధర్మము యొక్క తత్త్వమును, లక్షణమును తెలుపుడు. దండనము ఏ విధముగా విధించబడును? పాపములు చేసిన వారందరూ శిక్షార్హులేనా లేక వారిలో కొందరేనా? మాకు తెలియజేయండి అనిరి.

యమదూతలు ఇట్లు పలికిరి – వేదవిహితములైన కర్మలు ధర్మము. వేద నిషిద్ధములు, విరుద్ధములు అయిన కర్మలు అధర్మము. "వేదో నారాయణః సాక్షాత్" వేదము నారాయణుని స్వరూపము. జీవుడు తన శరీరం ద్వారా, వాక్కు ద్వారా, మనస్సు ద్వారా చేసిన కర్మలకు అగ్ని, ఆకాశము, రాత్రింబవళ్ళు, దిక్కులు, జలము, పృథ్వి, కాలము, ధర్మము అనునవి సాక్షులుగా వుండును. సకల ప్రాణులు తమ తమ సత్త్వరజస్తమో గుణములననుసరించి కర్మలు చేయుచుందురు. ఇక్కడ ఎవరు ఏ విధముగా ఎంత అధర్మాధర్మములను ఆచరించుదురో ఆ విధముగా అంతగా పరలోకమున ఫలమును అనుభవించుదురు.

వర్తమానోఽన్యయోః కాలో గుణాభిజ్ఞాపకో యథా ।
ఏవం జన్మాన్యయోరేతద్ధర్మాధర్మనిదర్శనమ్ ॥

భూత, భవిష్యత్తులను వర్తమానకాల అనుభవములను బట్టి ఊహింపవచ్చును. ఇప్పటి జన్మమునందలి పుణ్యపాపములే భూత, భవిష్యజ్జన్మల పుణ్యపాపములను నిర్ణయించును.

స్నేహభావాన్ని పెంచుకొని, త్యాగబుద్ధిని కలిగి ఉండి అందరిలోను నేను కూడా కలసే ఉన్నానని, నాతో కలుపుకొనే సమాజం ఉందని భావించినప్పుడు నీవు ఏకాకివి ఎలా అవుతావు? ఎక్కడైనా ఎప్పుడైనా అందరూ నీతోనే ఉన్నారు.

* * *

అపజయాలకు అవరోధాలకు విచారించవద్దు. ధైర్యము, సాహసముగల నిర్ణయాలు తీసుకొన్నప్పుడు ఎంతటి మహత్తరమైన కార్యక్రమాన్నైనా సాధించవచ్చు.

* * *

ప్రేమ, దయ, ఓర్పు, జాలి, కరుణ వంటి గుణాల వలన మానసిక ప్రశాన్తత పెరుగుతుంది. ఉద్రేకం ఉరవడి తగ్గుతుంది

– స్వామి చిన్మయానంద

జీవితమొక తోలుబొమ్మలాట

- శ్రీ సత్యసాయిబాబా

విశ్లేషణ : చీమలకొండ జయాశాస్త్రి

భగవాన్ శ్రీశ్రీశ్రీ సత్యసాయి దేహధారియైన జీవుని చావు, పుట్టుకల మధ్య తోలుబొమ్మలాటల్లో చేసే చిత్రవిచిత్ర నృత్య విన్యాసముల్లాంటి నడవడికను చాలా తమాషా కలిగిన పదములతో పాటగా పాడి మనకు కనువిప్పు కలిగిస్తున్న విధానము ఇటు హాస్యముగాను, అటు చురక వేసినట్టుగా ఎంతో చక్కగా వుంది. మనము స్వామి చెప్పినది 'చురక'గా భావించకుండా చుఱుకుగా ఆలోచించి మన వాస్తవమేమిటో తెలుసుకునే ప్రయత్నం చెయ్యాలి. అప్పుడే స్వామి చెప్పినదాంట్లో సత్యము గోచరించి, భ్రమలు వీడి దీనిలోని హాస్యమును మనము మనఃస్ఫూర్తిగా ఆహ్వానించి ఆనందిస్తాము. ఇక మనము స్వామి పాడిన పాటలోని పరమార్థము గ్రహించి ఆనందము అందుకునేందుకు ప్రయత్నిద్దాం.

తై తై తై తై తై బొమ్మా!
దీని తమాష చూదర మాయ బొమ్మ!
ఖ్యాతిగ దీనికి ముందువెన్కగల
కథ వివరింతును విను జీవా!

అంటూ బ్రహ్మాండమును నట్టువనారుగా నర్తింపచేసే స్వామి నట్టువాంగముపై పలికించే తాళముతో ఈ పాటను ప్రారంభించారు. మనము తమాషాగా నర్తించే తోలుబొమ్మలవలె ఉన్నామని చెబుతున్నారు. నిజమే! సృష్టిలో ప్రబలుతున్న చెడును ఎప్పటికప్పుడు రూపుమాపడానికి నటరాజుగా స్వామి చేసే నృత్యం లయబద్ధంగా ఉంటుంది. మనము

దేహాత్మభావముతో జన్మలెత్తుతూ జీవునిగా చేసే ప్రతి అడుగు తప్పటడుగులతో తమాషాగా తోలుబొమ్మలాటలాగా ఉంటుందని, స్వామి చాలా హాస్యముగా పై పాటను పాడారు. ఇక ఈ తోలుబొమ్మ యొక్క ఘనత ఎటువంటిదో వివరిస్తాను జీవా అంటున్నారు. ఇక్కడ మనలను 'జీవా' అని సంబోధిస్తున్నారు. కారణం, మనము ఆత్మస్వరూపులమైనప్పటికీ, మనస్సును వెంటపెట్టుకొని దాని యిచ్ఛానుసారం ఒక దేహమునుండి ఇంకొక దేహమునకు దేహాత్మబుద్ధితో బద్ధులమై ప్రయాణిస్తున్నంత సేపు మనము జీవులమే! మన నిజస్థితి తెలిపి మనలను విముక్తులను చెయ్యడమే లక్ష్యముగా ఈ పాటను పాడారు.

మాతృగర్భమున మలమూత్రముల
రోతల నీవు రోదింప
ప్రీతిగ వీరలు పేరంటమ్ములు
చేతురిదెంతటి చిత్రమురా! ॥తై తై ॥

తల్లి గర్భమంటే చీకటిలో, ఉమ్మనీరులో తలక్రిందులుగా తేలియాడుతూ, అక్కడే మలమూత్రములు విడుస్తూ, బయటకు పోయే మార్గము లేక భయానక స్థితిలో జీవుడు కాలము గడుపుతాడు. మనమందరము ఆ దుర్భర స్థితిని అనుభవించినా, స్మృతిలో లేకపోవడము చేత మనము ఎవరినైనా సహాయము అడిగినప్పుడు యథాలాపముగా 'చచ్చి నీ కడుపున పుడతాన'ని అంటూంటాము. స్వామి చెప్పిన గర్భస్థ స్థితిని తలచుకుంటే, మరల మరల జన్మించాలని కోరుకుంటామా! మనము గర్భవాసములో ఏడుస్తుంటే, సీమంతపు వేడుకలతో పేరంటాలు, ఉత్సవాలు చేసుకుంటూ ఉంటారని స్వామి ఎంత హాస్యముగా చెబుతున్నారు!

గర్భోపనిషత్‌లో ఇదే విషయము చెప్పారు –

"జాతశ్చాస్మి మృతశ్చాస్మి సంసార్యస్మి పునః పునః
జన్మమృత్యూ పునర్జన్మ పునర్మృత్యుః పునర్జనిః"

Scanned by CamScanner

'ఎన్నియోసార్లు పుట్టితిని, ఎన్నియోసార్లు చచ్చితిని, ఎన్నియోసార్లు సంసారినైయుంటిని. పుట్టుట, చచ్చుట, మరల పుట్టుట, చచ్చుట ఈ ప్రకారముగ నా కాలము గడిచిపోయినది' అని గర్భములోనున్న జీవుడు తొమ్మిదవ నెలకు చేరుకున్నప్పుడు పూర్తి స్పృహతో, పూర్వజన్మల స్మృతితో రోధిస్తాడట! ఈ మధ్యకాలములో శాస్త్రవేత్తలు తొమ్మిదవ నెల గర్భస్థ శిశువు తల్లి స్వరమును గుర్తుపడుతుందని నిరూపించారు. అంటే, గర్భవాసం చేస్తున్న జీవుడు స్పృహతోను, స్మృతితోను ఉంటాడని తెలుస్తోంది. మన పురాణాలలో ప్రహ్లాదుడు తన తల్లి లీలావతికి నారద మహాముని చెబుతున్న హరిలీలలను విని 'ఊ' కొట్టడం, అర్జునుడు సుభద్రకు పద్మవ్యూహము గురించి వర్ణిస్తుంటే, గర్భములోనున్న అభిమన్యుడు శ్రద్ధగా వినడమే కాకుండా, ఎన్నో సంవత్సరముల తరువాత జరిగిన కురుక్షేత్ర సంగ్రామంలో జ్ఞప్తికి ఉంచుకున్న సంఘటన మనకు తెలిసినవే! ఇంత నిగూఢ విషయాన్ని స్వామి ఎంత సూక్ష్మంగా చెప్పారు!

పుట్టితి మతి కోల్పోయితి దుర్గతి
పట్టితినని నీవేడువగా
అట్టే నవ్వుచు నానందించెద
రిట్టి వీరు నీకెవరయ్యా? ॥తై తై॥

ఇక జీవుడు పుట్టిన తరువాతి ముచ్చట్ల గురించి స్వామి హాస్యముగా చెబుతున్నారు. భగవాన్ ఇక్కడ 'మతి' అని మాండలీక పదమును ఉపయోగించారు. 'మతి'కి గుర్తు, గమనము అనే రెండు పర్యాయ పదాలున్నాయి. అంటే, 'నేను ఆత్మస్వరూపుడిని' అనే గుర్తు లేకుండా, నీ గమనము గర్భవాసమువైపునకు కాదని, ఆ పరబ్రహ్మవైపు వెళ్ళాలనే మతి లేకుండా దుర్గతి పట్టితినని నీవు ఏడుస్తుంటే, ఆనందముతో, నవ్వులతో, బాలసారెలని, నామకరణాలని వేడుకలు చేసుకునే 'నా' అన్నవాళ్ళు ఎవరని

నువ్వు ఆలోచించి, నీ దుర్గతి పోగొట్టి, నీకు శాశ్వతానందమును ప్రసాదించే నిజమైన ఆత్మబంధువు స్వామి తప్ప వేరెవరూ కాదని తెలుసుకొమ్మని ఎంత సున్నితముగా చెబుతున్నారు!

మసిలో మట్టిన మలమూత్రములన్
మసలుచు సిగ్గను మాటయె లేక
పసిపాపడవై ఏడ్చుచు లేచుచు
దినమొక నాటకమాడవకొ ॥తై తై ॥

ఇక్కడ స్వామి చెప్పినది ఆలోచిస్తే ఎంత గూఢార్థముందో తెలుస్తుంది. ఇతరులు ఎవరైనా దీర్ఘ రోగములతో మంచానపడి, ఎంతో దుఃఖంతో, సిగ్గుతో, నిస్సహాయతతో, నోటమాటరాక, మంచములోనే మలమూత్రాలు విసర్జిస్తుంటే, మనము వారి దుస్థితిని చూసి, అయ్యో! ఎంత నరకము అనుభవిస్తున్నారు! పూర్వజన్మలో ఏ పాపము చేశారో! ఈరకంగా బాధలుపడేకన్నా, వీరిని భగవంతుడు తొందరగా తీసుకొని వెళ్ళితే మంచిది అని ఎన్నెన్నో శాంతి వాక్యములు చెబుతూంటాము. కాని, అదే స్థితిలో శిశువుగా ఉన్న దేహములోని జీవుడు నిస్సహాయంగా మాటలురాక, మలమూత్రాదులలో పొర్లుతూ, ఏడుస్తుంటే మనము మమకారముతో మురిసిపోతాము! శిశువుగా ఉన్న దేహములోని జీవునికి మాత్రము ఈ దుర్భర స్థితి నుంచి తప్పుకోవడానికి రోజుకో నాటకములాగుంటుంది. ఇన్ని రకముల అవస్థలు చూస్తూ కూడా మనము అంతరంగములో ఏది సత్యమని తర్కించుకోకపోవడాన్ని గమనించి స్వామి ఈరకముగా చెబుతున్నారు.

తోడి వారలతొ కూడియాడుచు
వేడుకలతో పలు విద్యలు నేర్చుచు
చూడచూడగ చోద్యపు కళతో
ఏడేడునకు ఎదిగే బొమ్మా! ॥తై తై ॥

Scanned by CamScanner

తన తోబుట్టువులతో, స్నేహితులతో ఆటలు, పాటలు, గిల్లికజ్జాలు అన్ని రకముల విద్యలు నేర్చుకుంటూ జీవుడనే ఈ బొమ్మ ఎదుగుతుంటుందని స్వామి చమత్కారముగా చెబుతున్నారు. నిజముగా ఆలోచిస్తే, బాల్యావస్థ అనేది జీవుని మూర్ఖపు స్థితిని, పూర్తి అజ్ఞానముతో మంచిచెడులు, పాపపుణ్యముల తేడా తెలియని స్థితిని సూచిస్తుంది. కాని, బాల్యమును మనము ఎంతో హాయిగా గడిచిపోయే కాలముగా భావించి, పిల్లలూ దేవుడూ సమానమని అజ్ఞానముతో మురిసిపోతాము. ఆ పసివయస్సులోనే రాగద్వేషాలు, లోభత్వము, అసత్యము, అసూయ మొదలగు అవలక్షణాలకి మన మనస్సులో బీజాలు పడి మొలకెత్తడం ప్రారంభమవుతుంది. ఆ మొలకలే వయస్సుతోబాటు పెరిగి విష వటవృక్షాలుగా ఊడలు పోసుకుంటాయి. అందుకనే స్వామి **'చూడచూడగ చోద్యపు కళతో ఏడేదునకు ఎదిగే బొమ్మా'** అన్నారు.

స్వామి తరచూ చెప్పే ఉదాహరణ యిక్కడ మనము గుర్తుకు తెచ్చుకోవాలి – హాయిగా, స్వేచ్ఛగా ఉండవలసిన రెండు కాళ్ళ మానవుడు, నాలుగు కాళ్ళ పశువుగా, ఆరు కాళ్ల ఈగగా, ఎనిమిది కాళ్ల సాలీడుగా, చివరకు ఒళ్లంతా కాళ్లతో రోకలి బండ అనే పురుగుగా మారిపోయి సంసారములో పొర్లాడుతూ దుఃఖాలను ఏరకముగా కొనితెచ్చుకుంటున్నాడో అని స్వామి చెప్పే యిటువంటి సూక్ష్మవిషయాలను సాక్షాత్ గీతోపదేశముగా భావించకుండా మనం తమాషాగా ముచ్చటించుకోవడం ఎంత హాస్యాస్పదమో అనిపిస్తుంది.

ఓంకారాన్ని ఎలా ఉచ్చరించాలి

ఘంటానాదం ప్రశాంతం నుంచి బయల్వెడలి హెచ్చు స్థాయికి పెరుగుతుంది. తరువాత ప్రశాంతంలో కరిగిపోతుంది. ఆ విధంగానే ఓంకారాన్ని ఉచ్చరిస్తున్నప్పుడూ మృదులంగా ప్రారంభించి క్రమక్రమంగా శబ్దాన్ని పెంచి మరల మృదుల స్థాయికి తెచ్చి ఆపాలి. కొద్ది విరామం తరువాత మళ్లీ ఉచ్చరించాలి.

ఉద్ధవగీత

మూలం : శ్రీ వ్యాసమహర్షి
తెలుగు : యేలేశ్వరపు హనుమరామకృష్ణ

గుణత్రయ త్యాగ ఉపాయాలు

శ్రీఉద్ధవుడు: ఓ అనంతా! అద్వితీయా! శ్రీకృష్ణా! నిర్మలుడు – నిత్యుడు – స్వయమానంద స్వరూపుడు అగు పరమాత్మ దేహధారియై దేహ బంధమును పొంది జీవాత్మగా కనిపిస్తున్నాడు కదా! మరి ఈ దేహ బంధము ఏ రూపంగా ఏర్పడుతోంది.

శ్రీకృష్ణుడు: పరమ్ ఆత్మ – ఆ ఆవల ఉన్న ఆత్మ – అనికదా శబ్దార్థము! మరి దేనికి ఆవల? జగత్ – దేహాదులకు ఆవలవున్న ఆత్మ స్వరూపం, తెలియబడేదంతా తెలుసుకుంటూ వున్నట్టిది "ఆత్మ". తెలుసుకుంటున్న వానిని కూడా తెలుసుకొనుచున్నట్టిది. ఆత్మ సదా నిర్మలము – అప్రమేయము – సర్వాతీతము అయినదే!

అట్టి ఆత్మ స్వరూపమును కించిత్ ఏమరచి గుణములను ఆశ్రయిస్తోంది. అట్టి సత్త్వరజ తమోగుణ సంబంధంచేత (అనగా నేను గుణ సంబంధితుడను – అనే భావనయొక్క పరిపుష్టిచేత) స్థూల దేహ భ్రమ రూపుదిద్దుకొనుటకై, ఈ శబ్ద స్పర్శ రూప రస గంధముల సమ్మేళన రూపమగు దృశ్యములో దేహముగా బంధింపబడినట్లుగా కనిపిస్తోంది! అనగా, **స్థూల దేహ స్వరూపానుభూతి ఏర్పడుతుంది.**

ఇక ఆత్మ తన పరతత్వాన్ని ఏ మరచి ఇహత్వమును అభ్యసిస్తూ (having ignored the Beyondness to what is here and practising whatever here) దేహ పరంపరలు పొందటం కొనసాగిస్తోంది. దృశ్యములపట్ల గల పరిమిత దృష్టిచే ఏర్పడిన ఒకానొక బంధనపూర్వక అవినాభావ సంబంధమునే **సంసారము** అని పిలుస్తున్నారు!

ఉద్ధవుడు: స్వామీ! ఈ జీవుడు వాస్తవానికి సర్వదా ఆత్మస్వరూపుడే కదా! ఆత్మ అఖండము, అప్రమేయము అని వేద - ఉపనిషత్ ప్రవచిత ఆత్మ శాస్త్రములచే, ఆత్మజ్ఞులగు మహనీయులచే సిద్ధాంతీకరించబడుతోంది. మరి, . . . ఆత్మకు సత్త్వ - రజ - తమో గుణములు ఎక్కడి నుండి వచ్చి బంధం కలిగిస్తున్నాయి? ఈ దృశ్యము ఆత్మరూపమే అయివుండగా, ఆత్మయందు గుణ రూప లింగ దేహ బంధం, ఆ లింగ దేహంచే స్థూల దేహ బంధం, "ఈ దృశ్యములో దృశ్య తదాత్మ్యముచే జీవాత్మగా దేహబద్ధుడనై ఈ ఈ సంగతి సందర్భము ఇత్యాది వ్యవహారములలో చిక్కుకున్నానే!" అనే అనుబంధభావం, ఇవన్నీ ఎట్లా ఎవరి కారణంగా ఏర్పడుచున్నాయి?

శ్రీకృష్ణుడు: ఓ ఉద్ధవా! నీవు చెప్పినట్లు ఆత్మ ఎల్లప్పుడూ అతీతము, నిర్మలము, అఖండము - నిత్యోదితము - ఆనందస్వరూపమే!

మరి త్రిగుణ రూపమగు ఈ లింగ శరీరము (సూక్ష్మ శరీరము అని కూడా అంటారు) గురించి అడుగుతావా?

శ్లో ॥ సత్త్వం రజస్తమ ఇతి గుణా బుద్ధేః! న చ ఆత్మనః!
సత్త్వేన అన్యతమౌ హన్యాత్ సత్త్వం సత్వేనచైవ హి ॥

(అధ్యా. 13, శ్లో. 1)

సత్త్వము - రజము-తమము అను త్రిగుణములు ఆత్మకు సంబంధించినవి కానేకావు. మరి? అవి బుద్ధికి సంబంధించినవి మాత్రమే!

అజ్ఞానము - నిద్ర-బద్ధకము - భయము మొదలైన అంతర్గత విశేషములతో కూడిన **తమోగుణమును, నేను ఇది చేస్తున్నాను - అది చేయాలి - ఏదో చేయలేకపోతున్నాను - అక్కడికి వెళ్ళాను - ఇక్కడికి వెళ్ళాలి - ఈ లోకంలోకి వస్తున్నాను - ఆ లోకంలోకి ఇక వెళ్ళాలి -** ఇటువంటి రూపమగు రజోగుణమును మునుముందుగా జయించాలి, అది ఎట్లా?

శాంతి - ప్రేమ - ఓర్పు - దాక్షిణ్యము ఇటువంటి విశేషములతో కూడిన సత్త్వగుణసంపదతో రజ - తమోగుణములను జయించు. ఆ

విధంగా (సత్య - దయా - శాంతి - ప్రేమ - ఓర్పు - దాక్షిణ్యము ఇటువంటి విశేషములతో కూడిన సత్త్వగుణ సంపదతో రజ - తమోగుణములను) జయిస్తూ అటు తరువాత, **గుణాతీత వృత్తిచే** సత్య - దయా - శాంతి - ప్రేమ రూప వృత్తులకు కూడా క్రమంగా అతీతుడవు - సాక్షివి - గుణాతీతుడవు అగుము. ఎప్పుడెప్పుడైతే సత్త్వగుణము వృద్ధి పొందుతూ వుంటుందో, అట్టి సందర్భాలలో క్రమక్రమంగా సర్వాంతర్యామి - సర్వతత్త్వ స్వరూపుడనగు నాపట్ల భక్తి - ప్రపత్తి స్వభావసిద్ధంగా ఉత్పన్నమౌతూ వుంటుంది.

అట్టి భక్తి లక్షణములు కించిత్ సాధనచే కొంచెము కొంచెము ప్రవృద్ధం అగుచుండగా, సత్త్వగుణం మరింతగా తనంతటతానే వృద్ధి అగుచూ వుంటుంది. సత్త్వగుణం నుండి **ధర్మము** అనే రుచికరమైన సాత్విక గుణఫలం ఫలదీకరిస్తూ వస్తుంది. అధర్మము క్రమంగా బలహీనమౌతూ వుంటుంది.

ఈ సత్త్వ - ధర్మ గుణాలు పరస్పరం అభివృద్ధి పరచుకుంటూ వుంటాయి. ధర్మమును మరికొంత - మరికొంతగా ఆశ్రయిస్తూ వుండగా, రజోతమో గుణాలు బలహీనమగుచూ, క్రమక్రమంగా మొదలంట్లా జయించివేయబడుతూ వస్తాయి. రజ - తమో గుణాలు బలహీనమగుచూ వుండగా, ... ఆ రెండింటికీ మూలమైన అధర్మము కూడా (అధర్మభావాలైన కామము - రాగము - క్రోధము - లోభము మొదలైన ఆత్మానుభవానికి వ్యతిరిక్త భావాలు) శీఘ్రంగా బలహీనపడుతూ వస్తాయి.

ఉద్ధవా: త్రిగుణములు బుద్ధిలోనే ఏర్పడి, బుద్ధిలోనే దాగి ఉంటున్నాయి. అయితే, ఈ త్రిగుణములు ప్రదర్శనమవటానికి స్థానం ఏమిటంటావా?

1. **ఆగమము :** తెలియబడే దృశ్యజగత్తు
2. **ఆపః :** జలము. ఆపోమయ ప్రాణః : శక్తి : ప్రకృతి
3. **ప్రజా :** జనులతో సంసర్గము
4. **దేశః :** దేశము (Place factor)

Scanned by CamScanner

5. కాలము : (time factor)

6. కర్మ : (The acts / actions)

7. జన్మ : నేను జన్మించినవాడను అను రూపమైన స్వస్వరూపమునకు సంబంధించిన ఏ మరుపు

8. ధ్యానము : (The sense of Avocation)

9. మంత్రము : (The act of Chanting)

10. సంస్కారము : (Tedency)

ఈ పది వస్తువులు ఆయా వివిధ గుణ ప్రదర్శనమునకు కారణమవుతూ వుంటాయి. **మోక్ష శాస్త్రము ఎఱిగిన మహనీయుల బోధ విను :**

1. తామస గుణమును తిరస్కరించటానికి శాస్త్రప్రవచితమైన సాధనలకు సిద్ధపడండి.
2. తామస గుణాన్ని జయించే ప్రయత్నంలో రజోగుణాన్ని ఉపేక్ష (Just ignoring) అనే సమరసపూర్వక బుద్ధిబలంతో జయించండి.
3. తామస రాజసగుణములు బలహీనబడుచుండగా సాత్విక గుణం బలపడుచున్నది (లేక) సత్త్వగుణం బలం పుంజుకుంటూ వుండగా రజోతమోగుణాలు వాటికవే బలం కోల్పోతూ వస్తాయి.

ఏ. ఏ అభ్యాసాలు సత్త్వగుణమును పెంపొందించుతాయో, అట్టి అభ్యాసములు ఆశ్రయించటం ఉచితం! అవసరం! అత్యావశ్యకం కూడా! – అని బోధిస్తున్నారు!

ఓ ఉద్ధవా! జగత్ సంబంధమైన **స్మృతి – అపోహ** కొనసాగునంతవరకు, ఈ దృశ్యము స్వస్వరూపాత్మ యొక్క ప్రత్యక్షరూపంగా అనుభూతం కానంతవరకు, స్థూల–సూక్ష్మదేహభావాలు తొలగనంతవరకు, . . . **ఎంతెంత వరకైతే** అవి కొనసాగుతూ వుంటాయో... **అంతంత వరకు** సత్త్వ గుణాభివృద్ధికై సాత్విక గుణాలు సేవిస్తూనే ఉండాలి!. ఉత్తమ గుణాలు, దైవీసంపత్తి పెంపొందించుకొనే ప్రయత్నాలకు ఉపక్రమించకుండా "కృష్ణా!

రక్షించు!" అని మాత్రమే పలుకుతూ ఉంటే, ఈ సంసారపయోధి నుండి నేను రక్షించేదెట్లా? అయితే నాపట్ల భక్తి స్వభావసిద్ధంగా సాత్వికగుణములను ఉత్తేజపరచగలదు.

సాత్విక గుణాలు సేవిస్తూ వుండగా ధర్మము అనే ఉత్తమ బుద్ధి ప్రేరేపించబడుతూ వుంటుంది. ధర్మమునే తత్త్వజ్ఞానం (త్వమ్ తత్ సత్ ఇతి జ్ఞానః – నీవుగా కనిపిస్తున్నది ఆత్మయొక్క ప్రత్యక్షానుభవరూపమే... అనే జ్ఞానం) వృద్ధి చెందుతూ వుంటుంది. కనుక బద్ధకం వదులు. ప్రేమ–కరుణ–త్యాగము ఇత్యాది గుణాలను వృద్ధి చేసుకో!

ఉద్ధవుడు: ఓ శ్రీకృష్ణ ప్రభూ! మా జీవుల కథ –కమామీషు చూస్తూ వుంటే, నాకు ఆశ్చర్యం! ఈ జగత్ విషయాలు, ఇక్కడి ఆయా సంబంధ – బాంధవ్య లౌకికాశయాలన్నీ అనేక దుఃఖపరంపరలకు కారణములగుచున్నాయని మేము అనేక సందర్భాలలో గమనిస్తూనే ఉన్నాము. అల్పజ్ఞాన జంతువులగు కుక్క – గాడిద – మేకవలె అనేక దుఃఖాలు సహిస్తూ కూడా... మేము విషయానుభవములు కొనసాగించటానికే సిద్ధపడుచున్నామే! ఎందుచేత? దీనికి కారణం ఏమిటి? అట్టి విషయానుభవములపట్ల భావావేశము – అనే రజోగుణసంబంధమైన వృథా యాసమునుండి విరమించటం ఎట్లా?

శ్రీకృష్ణుడు: అవివేకం చేతనే – **ఈ దేహరూపమే నా రూపం! దీనితోనే నా ఉనికి! ఇద్దాని స్థితిగతులే నా యొక్క స్థితి గతులు...** అనే రూపముతో కూడిన దోషబుద్ధి ప్రమత్తతచేత (because of lazyness of intelligence), అవివేకంచేత రూపుదిద్దుకుంటోంది! దేహాత్మబుద్ధి యొక్క కొనసాగింపువలన దుఃఖాత్మకమైనట్టి ఘోర (స్థూల) రజోగుణం వచ్చి మనస్సు (thought)ను కప్పివేస్తోంది.

రజోగుణప్రభావంచేత సత్త్వగుణం కప్పబడినదై... సంకల్ప – వికల్పాలు అనుక్షణికంగా, అవిశ్రాంతంగా బయల్వెడలుచున్నాయి! అట్టి తరుణంలో

Scanned by CamScanner

అల్పబుద్ధితో కూడిన ఈ జీవుడు విషయులను ప్రవాహపతితంగా ఆలోచించనారంభిస్తున్నాడు.

ఇకప్పటినుండి పరంపరంగా విషయవాసనలు పుట్టుకొస్తున్నాయి.

విషయకామవశుడైన ఈ జీవుడు మరికొన్ని కర్మలు! **కర్మపరంపరల వలన ప్రయోజనం దుఃఖమే!...** అని తెలిసికూడా, ఇచ్ఛలేకున్నప్పటికి అభ్యాసము యొక్క బల - వేగ ఉద్విగ్నతలకు లోను అయి, చేసిన కర్మలనే మరల - మరల నిర్వర్తిస్తున్నాడు. చర్విత చర్వణుడౌతున్నాడు! జన్మ తరువాత మరణం, మరణం తరువాత జన్మ - ఇట్లా జన్మ పరంపరా వ్యవహారములను కొనసాగిస్తూనే పోతున్నాడు.

ఉద్ధవుడు: స్వామీ! మరి ఉపాయం?

శ్రీకృష్ణుడు: విద్వాంసుడు వివేకి అయినవాడు రజోగుణం - తమోగుణములచే విక్షిప్తుడు (sorrounded) అయినప్పటికీ, మనస్సుచే - ఇంద్రియములకు - ఇంద్రియార్థముల చమత్కారములగు జగత్ విషయములకు **అతీతత్వము** అభ్యసిస్తున్నాడు. చిత్తమును నిగ్రహించి, విషయములకు అతీతత్వము సంపాదించినవాడై వుంటున్నాడు. "కర్మల యందు, కర్మఫలముల యందు దోషం ఉంటూనే ఉంటుంది - అని గ్రహించినవారై... సర్వదా కర్మల యందు, వాటికి సంబంధితమై యుండే తదితర వ్యవహారాల పరంపరల యందు వారు **అనాసక్తులై** (Mentally unattached) **వుంటున్నారు.**

కనుక మిత్రమా! ఈ జీవుడు సర్వదా అప్రమత్తుడై క్రమక్రమంగా మనస్సును సర్వతత్త్వ స్వరూపుడైన నాయందు నిలిపి ఉంచుగాక! 'ఇదంతా మమాత్మచైతన్య ప్రభావ వీచికా చమత్కారమేగదా!' అని ఆస్వాదించుగాక! అందుకు గాను అభ్యాసపూర్వకంగా శ్వాసను ప్రాణాయామాదుల సహాయంతో నిశ్చలం చేస్తూ శిరస్సుకు ఊర్ధ్వంగా నిలుపుచూ ఆసనజయం సముపార్జించునుగాక! క్రమంగా విషయాలకు అతీతమైన ఏకాగ్రతను అనుసంధానం చేయునుగాక!

అమ్మ ఆరాధన

- డా|| కె.బి.రాజేంద్రప్రసాద్, 9799300342

అమ్మ అమృతంకన్నా మిన్నయైనది. అమ్మతనం అమరత్వం కన్నా, అక్షర పరబ్రహ్మ సాక్షాత్కారంకన్నా దివ్యమైంది. భవ్యమైంది. అమ్మలేని, అమ్మకాని భవితను ఊహించలేము. అమ్మాయని పిలుచుకోగల్గడం, అమ్మాయని అన్పించుకోవడంలోగల ఆనందానుభూతి అనిర్వచనీయం. అనుభవైక వేద్యమది. ఈ విశ్వంలో అమ్మ ఒక శక్తి. ఒక సంస్థ. ఒక దీప్తి. స్ఫూర్తి. ఒక మహోన్నతమూర్తి. ప్రకృతి ప్రచలనానికి, ప్రచోదకానికిని, ప్రకాశానికి, వికాసానికి బలం, ఫలం. విశ్వసృష్టికి, విశ్వపుష్టికి, విశ్వతుష్టికి అమ్మ అనుగ్రహమే ఆధారం. నిజానికి ప్రతి స్త్రీమూర్తిలోను మాతృరూపం ఉంది. ఆ రూపాన్ని, ఆ దీపాన్ని చూడగల్గడం సుకృతం. అర్క కిరణం, అగ్నికణం కన్నా పావనమైన అమ్మ అనుగ్రహదీప్తిని అందుకోగల్గడంకన్నా అదృష్టం ఏముంటుంది? అందుకనువైన పావనమైనకాలం ఆశ్వియుజమాసంలో శుక్లపక్షమిలో పాడ్యమీ మొదలు దశమివరకున్న పది దినములు. అయితే మొదటి తొమ్మిది దినాలు అమ్మ అవతారాల పూజలు. పదియవనాడు అమ్మ అసలు రూపం శ్రీరాజరాజేశ్వరీమాత రూపంలో అమ్మ పూజలందుకొంటుంది. శరదృతశోభ, పండువెన్నెలలు పసిడి కాంతులు, చల్లని మలయమారుతాల వీచికలలో అర్చన, ఆరాధనలతో అమ్మను దర్శించి, బీజాక్షర మంత్రపఠనంతో స్మరించి మనం పునీతులం కావలసిన శుభసమయం ఈ శరన్నవరాత్రుల శుభతరుణం.

ప్రపంచంలో భారతీయ ధర్మం విశిష్టం, విఖ్యాతమైంది. కారణం మన ధర్మానికి మూలం వేదం. ధర్మానికి ఆధారం ఆచారం. సదాచారం.

Scanned by CamScanner

వైదిక ఆచారాల సమన్వయసారం భారతీయధర్మం. అయితే ఒకే ధర్మాన్ని, వైష్ణవం, శైవం, శాక్తేయం అని త్రివిధంగా భావించి, ధరించి ముందుకు పోతున్నాం. నిజానికి అక్షర పరబ్రహ్మతత్త్వం ఒక్కటే. ఆ తత్త్వాన్ని వైష్ణవులు విష్ణువు అని, శైవులు శివుడని, శాక్తేయులు ఆదిపరాశక్తి శ్రీరాజరాజేశ్వరీ మాతయని అంటున్నారు. ఆదిపురుషుడైన పరమాత్మ ప్రకృతి శక్తియైన ఆదిశక్తితోడ్పాటుతోనే ప్రపంచాలను సృష్టించాడనేది అక్షరసత్యం.

ఆదిశక్తి జగన్మాత. మనలో శక్తిగా, విద్యగా, బుద్ధిగా, మేధస్సుగా, తల్లిగా, చెల్లిగా, కాంతిగా, భ్రాంతిగా, మమకారం, అహంకారం ఇలా ఒక్కటేమిటి? బహురూపంగా అమ్మ గోచరిస్తోంది. జీవచైతన్య స్ఫూర్తి జగన్మాత.

ప్రళయకాలంలో సాగరవీచికలపై శ్రీహరి వటపత్రశయనుడై, బాలుడై కాలిపై కాలు వేసుకొని, బొటనవ్రేలు నోట జుర్రుకొంటూ "నేనేంటి? ఈ నీటిపై, మర్రియాకుపై ఊయలలూగడమేమిటి? కమ్మని జోలపాటలు విన్పిస్తున్నాయి. ఎవరు పాడుతున్నారు" అని దిక్కులను అయోమయంగా చూస్తుండగనే "గోవిందా! పసివాడవై పరమార్థ జ్ఞానాన్ని విస్మరించావుకదా" అంటూ ఓ స్త్రీమూర్తి దగ్గరకువచ్చింది. శ్రీహరికి మాయ తొలగింది. "అమ్మా! నీవాతల్లి యింతసేపు జోలపాడుతూ నన్ను ఆడించింది. "ఏకమేవాద్వితీయం బ్రహ్మ" అన్న వాక్యార్థం నీవేగా తల్లీ" అంటూ అంజలించి ప్రార్థించిన వైనం మరువరాదు. దేవాది దేవుడైన పరమాత్మనే బిడ్డగా ఊయలలూపి జోలపాడిన తల్లి జగన్మాత. ఆ తల్లినే పోతనకవి –

అమ్మల గన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ చాలఁబె
ద్దమ్మ సురారులమ్మ కడుపాఱడి పుచ్చిన యమ్మదన్నులో
నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడియమ్మ దుర్గమా
యమ్మ కృపాబ్ధి యిచ్చుత మహత్త్వ కవిత్వ పటుత్వ సంపదల్

అంటూ లక్ష్మీసరస్వతీ పార్వతీ దేవులకు మూలమై, దనుజమర్దినియై, అడిగింది కాదనక యిచ్చే జగన్మాత దుర్గాంబను మహత్వకవిత్వ పటుత్వ సంపదకై ప్రార్థించాడు. మరొకమారు "నిన్ నమ్మినవారికెన్నడు నాశము లేదుగదమ్మ యీశ్వరీ" యంటూ నమ్మకాన్ని వమ్ముచేయని యమ్మ దుర్గమ్మ యని స్పష్టం చేశాడు.

త్రిమూర్తులను స్త్రీ మూర్తులనుగా మార్చి మణిద్వీపానికి కొనిపోయి, వారికి సృష్టి రహస్యాలను తెలియజెప్పి, సృష్టి స్థితిలయలనే కార్యక్రమాలను అప్పగించి వారికి లక్ష్మీసరస్వతీపార్వతులను స్త్రీ శక్తులనుగా యిచ్చి, తిరిగి వారిని మామూలుగా మార్చి, తాను శ్రీరాజరాజేశ్వరీ మాతయై సర్వాన్ని పర్యవేక్షించే బాధ్యతను తీసుకొన్న మహాతల్లి జగన్మాత. శ్రీనాథ మహాకవి "వేదపురాణశాస్త్ర పదవీనయసేయైన పెద్ద ముత్తైదువ" అని అమ్మను సంబోధించాడు. అమ్మ మహిమా వైభవానికి నిలువెత్తు సాక్ష్యం శ్రీమద్దేవీభాగవతం.

ప్రళయకాలంలో భూమి సర్వమూ సాగరజలమయమవుతుంది. అప్పుడు బ్రహ్మకు ఆధారం శ్రీహరి నాభికమలంకాగా, శ్రీహరికి ఆదిశేషుడు, ఆయనకు సముద్రం, సముద్రముయొక్క స్థితికి సర్వశక్తి పరాశక్తే ఆధారం. అందుకే త్రిమూర్తులు.

శ్లో ॥ నత్వామృతే కిమపి వస్తుతం విభాతి
వ్యాప్యైవసర్వమఖిలం త్వ మవస్థితాఽసి ।
శక్తిం వినా వ్యవహృతౌపురుషోఽపశక్తో
బంభణ్యతే జనని బుద్ధిమతా జనేన ॥

అంటూ ప్రాంజలించారు. "అమ్మా! ఈ సృష్టిలో నీ అనుగ్రహం లేకుండా ఏ వస్తువూ చలించదు. నీ చైతన్యశక్తియే అంతటా నిండియుంది. నీ శక్తిలేని యెడల పరమపురుషుడు కూడా అశక్తుడేయని పండితులు

చెప్తున్నారు. కనుక నీటిలో చల్లదనం, అగ్నిలో వేడి, సూర్యునిలోని కాంతి, చంద్రుడిలోని శీతలం మొత్తంగా విశ్వశక్తి జగన్మాత ఈ తల్లికి రూపాలు, నామాలు, శక్తులు, యుక్తులు, మంత్రాలు, తంత్రాలు, స్తోత్రాలు అసంఖ్యాకం.

అమ్మను ఆరాధించే శుభ సందర్భం శరన్నవరాత్రులు. "దుర్గాలక్ష్మీ సరస్వతీ, సావిత్రీ, రాధా అనే ప్రకృతి పంచకంపైనే ఈ చరాచర ప్రకృతి సృష్టి ఆధారపడి నడుస్తోంది" అని నారాయణుని హితవు. కనుక నవదుర్గలను ఈ తొమ్మిది రోజులు భక్తులు భజిస్తారు. కనకదుర్గమ్మను

శ్లో ॥ **నవరాత్రి సమారాధ్యాం నవచక్రనివాసినీమ్ ।**
నవరూపధరాం శక్తి నవదుర్గముపాశ్రయే ॥

అంటూ బిడ్డలు నవదుర్గలను సంస్తుతిస్తూ ఆరాధనకు శ్రీకారం చుడుతున్నారు.

శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండ, స్కందమాత, కాత్యాయనీ, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిధాత్రి అనేపేర్లతో నవదుర్గల పూజలు నిర్వహిస్తున్నారు. తొమ్మిది దినాలు పై తొమ్మిది దుర్గామాతల రూపాలను మనం దర్శిస్తాం.

మరికొన్ని ప్రాంతాలలో కనకధుర్గ, బాలా త్రిపురసుందరి, గాయత్రి, అన్నపూర్ణ, శ్రీలలితాత్రిపురసుందరి, శ్రీమహాలక్ష్మి, శ్రీసరస్వతీమాత, దుర్గాదేవి మహిషాసురమర్ధిని చివరకు పదవరోజున శ్రీరాజరాజేశ్వరీమాత్ర అలంకారంతో అమ్మవారిని పూజించడం జరుగుతోంది.

ప్రతి అవతారానికి ఒక ప్రత్యేకత ఉంది. ప్రతి ప్రత్యేకతకూ ఒక ప్రయోజనం ఉంది. దుర్గమాసురుణ్ణి చంపి దుర్గయైనది. అసంఖ్యాకమైన నేత్రాలనుండి నీటి ప్రవాహాన్ని జాలువారించి, అనావృష్టిని తరిమి శతాక్షియైనది. అనేక శాకాలతో, కందమూలాలతో కన్పించి, జ్ఞానులైన

మునులకు, సురలకు ఆకలిదప్పులు దీర్చి శాకంబరియైనది. భండాసురుని కుమారులను బాలయైతునిమేసింది. భండాసురుణ్ణి లలితాదేవియై మర్ధించింది. మహిషుణ్ణి మర్ధించి మహిషాసురమర్ధినియయినది. చండముండులను, శుంభనిశుంభులను సంహరించింది. అన్నపూర్ణయై ఆకలిదీర్చింది. అవిద్యావంతులకు విద్యాగంధం అనుగ్రహించింది. శ్రీవిద్యామాతయైనది. శ్యామలాదేవియై నిరక్షర కుక్షియైన వెర్రిగొఱ్ఱెల కాపరిని కాళిదాసుగ మార్చింది. అందుకే ఆయన

"సర్వయంత్రాత్మికే సర్వమంత్రాత్మికే సర్వతంత్రాత్మికే సర్వముద్రాత్మికే సర్వశక్త్యాత్మికే, సర్వవర్ణాత్మికే...." అంటూ ప్రాంజలించాడు. అమ్మదయాంబురాశి. "అమ్మా" అన్నవారిని ఆదుకొనేతల్లి. నిత్యం మన తల్లిలో, చెల్లిలో, ఇరుగుపొరుగమ్మలలో కన్పిస్తుంది. అందుకే స్త్రీ మూర్తులను గౌరవించే చోటున దేవతలుంటారంటారు పెద్దలు.

అమ్మ ఆరాధన శక్తివంతమైంది. అమ్మ సేవ చేవను కలుగజేస్తుంది. అమ్మ జపం జవసత్త్వాలకు మూలం. అమ్మ మన శక్తి. అమ్మ మన యుక్తి. అమ్మ మన ధైర్యం. అమ్మ మన విశ్వాసం. మన భాష, ఆశ, శ్వాస, ఆనందం అమ్మే. మన అమ్మలో జగదంబను చూచుకొని ఆరాధన చేద్దాం. లేదా మన అమ్మను జగన్మాతలో చూద్దాం. కడుపునిండా తిండి కన్న తల్లి ఒక్క రూపు. శ్రీనాథుడు "ప్రాణము ప్రాణము తల్లి యున్నదే" అంటారు. జగన్మాత దుర్గామాతను దర్శించి, సేవించి, పూజిద్దాం. కన్న తల్లిని కమనీయంగా పూజించి ఆశీస్సులను పొందుదాం.

నవరాత్రి అమ్మ పూజ – మానవాళికి అమ్మనాన్నల సేవే పరమార్థం. అవునంటారుకదూ!

భగవన్నామస్మరణలో ఆకర్షణా, ఆనందమూ వృద్ధి అయితే ఇక ఎలాంటి భయమూ ఉండదు. భగవన్నామమూ భగవంతుడూ వేరు కాదు. భగవన్నామం సర్వశక్తిమంతము. – **శ్రీరామకృష్ణ పరమహంస.**

వార్తలు

(01). 15-8-2019 తేది గురువారం శ్రావణ పౌర్ణమి నందర్భంగా శ్రీశుకబ్రహ్మాశ్రమంలో పూజ్యశ్రీ గురుదేవుల పాదుకలకు షోడశోపచారపూజ జరిగినది. 23-8-2019 తేది శుక్రవారం కృత్తిక సందర్భంగా ఆశ్రమంలో యథాప్రకారం శ్రీసుబ్రహ్మణ్యం స్వామికి ప్రదోషకాలంలో అభిషేకం, అర్చన జరిగినది. 29-8-2019వ తేది గురువారం మాసశివరాత్రి సందర్భంగా ఆశ్రమ శివాలయంలో ప్రదోషకాలంలో శ్రీ నర్మదేశ్వరమహాదేవునకు రుద్రాభిషేకం, బిల్వార్చన జరిగినది.

(02). 18-8-2019వ తేది నుండి ఏడు రోజులలో శ్రీ శుకబ్రహ్మాశ్రమం వారి రామాయణజ్ఞానయజ్ఞం శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రసన్న వరదరాజస్వామి దేవాలయ ప్రాంగణంలో జరిగినది. ఈ జ్ఞానయజ్ఞాన్ని 18వ తేది సాయంకాలం శ్రీశుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతులు పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు ప్రారంభించారు. గుంటూరు-నంబూరు కాళీవనాశ్రమవాసి, మంచివక్త శ్రీనివాసరామానుజదాసుగారు ఈ వారం రోజులు సుందరకాండపై ప్రవచన చేశారు. పట్టణ పౌరులు చాలా మంది విని ఆనందించారు.

(03). 23-8-2019వ తేది శుక్రవారం శ్రీశుకబ్రహ్మాశ్రమంలో శ్రీకృష్ణ జన్మాష్టమి కార్యక్రమం చాలా విశేషంగా జరిగినది. విజయవాడ రాధామాధవ భజనమండలి సంస్థాపకులు మాతృశ్రీ మంచాల సుమిత్ర గారి ఆధ్వర్యంలో శ్రీకృష్ణునికి పూజ. వివిధ ఫలహారాలతో భగవంతునికి భోగం, భజనలు చాలా ఆనందంగా జరిగినవి.

(04). 25-8-2019వ తేది ఆదివారంనాడు తిరుపతి రూరల్, పుదిపట్ల గ్రామంలోని శ్రీరామకృష్ణ సేవాసమాజ వార్షికోత్సవం ఆశ్రమ ఆవరణలో జరిగినది. ఆశ్రమ ముఖ్య కార్యకర్తలు శ్రీ సుబ్బరాయలుగారు, శ్రీరామకృష్ణగార్ల ఆధ్వర్యంలో శ్రీస్వామీజీల ప్రవచనాలు, గురుమహరాజు, మూర్త్రిత్రయ పూజ, ఆరాత్రికం, అన్నదానం వగైరా చాలా బాగా జరిగినది. అందు పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు పాల్గొనినారు.

(05). శ్రీశుకబ్రహ్మాశ్రమంలో ప్రారంభించిన అర్ధచాతుర్మాస్య వ్రతం బాగుగా జరుగుతూంది. పూజ్యశ్రీ సర్వాత్మానందగిరి స్వాములవారు ప్రతిరోజు ఉదయం విద్యారణ్యులవారి పంచదశిపైన, సాయంకాలం శ్రీమద్భాగవతం పదవస్కంధంపైన ప్రవచన చేస్తున్నారు.

(06). ఆశ్రమ కంటి ఆసుపత్రిలో జూలై నెలలో ఓ.పి. విభాగంలో 1303 మందికి కంటి పరీక్షలు జరిపి తగు చికిత్సలు చేశారు. 103 మందికి కళ్ళలో పొరలు తొలగించి లెన్సు అమర్చినారు 6 యాగ్ లేజరు చికిత్స చేశారు. 4 గ్రామాలలో కంటివైద్యశిబిరాలు నిర్వహించారు.

చదవండి చదివించండి ఆస్వాదించండి

శ్రీశుకబ్రహ్మాశ్రమ ప్రచురణలు

పూజ్యశ్రీ విద్యాప్రకాశానందస్వాములవారి రచనలు

		రూ.
1.	గీతామకరందం (తెలుగు)	350/-
2.	" (ఆంగ్లం)	400/-
3.	భాగవతరత్నాకరము	300/-
4.	భారతరత్నాకరము	300/-
5.	రామాయణరత్నాకరము	300/-
6.	వాసిష్ఠరత్నాకరము (యోగవాసిష్ఠము-వసిష్ఠగీత)	300/-
7.	ఉపనిషద్రత్నాకరము	100/-
8.	మోక్షసాధనరహస్యము	100/-
9.	గీతోపన్యాసములు	120/-
10.	బ్రహ్మచర్య విజయము	50/-
11.	పరమార్థకథలు	75/-
12.	ఆత్మానుసంధానము	50/-
13.	బ్రహ్మానందవైభవము	50/-
14.	అమృతబిందువులు	60/-
15.	తాత్పర్యగీత (స్థూలాక్షరి)	50/-
16.	జీవుడా! మేలుకో	60/-
17.	మనస్సా! వినుమా	60/-

స్వామి శ్రీవిద్యాస్వరూపానందరచనలు

1.	భగవద్గీత గూఢార్థ దీపిక 3 భాగాలు (మూలము మధుసూదన సరస్వతి)	150/-
2.	ఉపనిషత్కథలు	40/-
3.	యోగసుధాకరము (సదాశివేంద్ర సరస్వతి)	50/-
4.	వేదసదస్సు	60/-

పోస్టేజి అదనము

Scanned by CamScanner

Regd.No. TRP / 123 / 2018 - 20 September 2019 Rs.10/- R.No.8139/63
Date of Publication 26-08-2019, Permitted to post : 29th, 30th every month.

23-08-2019వ తేది శ్రీకృష్ణ జయంతి లో
పూజలందుకొన్న శ్రీకృష్ణుడు

ఈ పేజి స్థల దాతలు

సుభద్రా చారిటబుల్ ట్రస్టు

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం

Scanned by CamScanner